ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

మంగళవారం 12 ఆగస్టు 2025

రైతు బీమా దరఖాస్తుకు మిగిలింది ఒకేరోజు

దరఖాస్తుకు గడువు రేపటితో పూర్తి

స్వల్ప వ్యవధిలో నమోదు సాధ్యమయ్యేనా?

ప్రభుత్వం తీరును ఖండిస్తున్న రైతు సంఘాలు

7



రావాల్సింది రూ. 8కోట్లు.. వసూలు చేసేది రూ.12.40లక్షలు

ఐడీఏ బొల్లారంలో మున్సిపల్ ఆదాయానికి గండి

పంచాయతీ అంచనాల ఆధారంగానే వసూళ్లు

ఇంటి నంబర్లతో కంపెనీలకు పన్నులు

ఐడీఏబొల్లారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ కంపెనీ నుంచి రూ.8కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం రూ. 12.40లక్షలు మాత్రమే వసూలు చేస్తున్నారు. కొత్తగా విధుల్లో చేరిన కమిషనర్ తాజాగా పన్ను లెక్క కట్టడంతో ఈ విషయం వెలుగు చూసింది. తీరా వసూలు చేయబోతే నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఒకరు అడ్డుకుంటున్నారు. 4.7ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కంపెనీకి పక్కనే ఉన్న ఇంటి నంబరు వేసి రూ. 45.4వేలు పన్ను తీసుకుంటున్నారు. 9,680 గజాల్లో కంపెనీకి రూ.1.5లక్షలు, 3,993 గజాల్లో ఉన్న పరిశ్రమకు ఇంటి నంబర్లు వేసి రెసిడెన్షియల్ జోన్‌గా చూపించి రూ.81వేల పన్ను తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. మరో ఇంటికి 2,178 గజాల్లో నిర్మాణానికి కేవలం రూ.486 పన్ను విధించారు. పక్కనే ఉన్న 138 గజాల ఇంటికి మాత్రం రూ.8,485 వేలు పన్ను విధించారు'. ఇలా ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పన్ను వసూలులో అధికారులు చేతివాటం చూపుతున్నారు. పారిశ్రామికవాడలో పరిశ్రమల నుంచి రూ. కోట్లలో పన్నులు వసూలు చేయాల్సి ఉండగా సిబ్బంది కుమ్మక్కై రూ. వేలల్లోనే తీసుకుంటున్నారు.

పంచాయతీ లెక్కల ప్రకారమే..

ఆదాయ మార్గాలపై నిత్య పర్యవేక్షణ జరగడం లేదు. పంచాయతీగా ఉన్న సమయంలో చేసిన మదింపు నేటికీ కొనసాగుతోంది. 2017లో మున్సిపాలిటీగా ఏర్పాటయిన తరువాత కొత్తగా ఎటువంటి మదింపు ప్రక్రియ జరగలేదు. మరోవైపు కంపెనీ యజమానులు చేసిన తమ అక్రమాలు బయటకు రాకుండా మున్సిపల్ సిబ్బందిని గేటులోకి తొందరగా అనుమతించడం లేదు. ఓ జాతీయస్థాయి పరిశ్రమ విషయంలో కొలతలు వేయడానికి వెళ్లిన సిబ్బందిని లోనికి అనుమతించకుండా కంపెనీ యాజమాన్యం అడ్డుకుంది. సమాచారం అందుకున్న నియోజకవర్గ ప్రజాప్రతినిధి కమిషనర్‌ను పిలిపించి మాట్లాడారు. పన్ను వేసేటప్పుడు నాకు చూపించి వేయాలంటూ హుకుం జారీ చేసినట్టు సమాచారం. కంపెనీ లోపలికి వెళ్లిన

మిగతా 8వ పేజీలో

ప్రొటోకాల్ పంచాయితీ

మెతుకు సీమలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వర్సెస్ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

వివాదాస్పదంగా ప్రభుత్వ కార్యక్రమాలు

దుబ్బాక, నర్సాపూర్‌లో నిత్యం సిగపట్లు

సిద్దిపేట, గజ్వేల్, పటాన్‌చెరు, నర్సాపూర్‌లో కాంగ్రెస్‌లోనే వర్గపోరు

మంత్రుల సమక్షంలోనే తోపులాటలు

సతమతమవుతున్న అధికారులు



నర్సాపూర్ నియోజకవర్గం చిలప్‌చెడ్‌లో అధికారిక కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట(ఫైల్)

రాజకీయ నేతల ఆధిపత్య పోరులో ప్రభుత్వ కార్యక్రమాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఈ పరిస్థితి ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నిత్యకృత్యంగా కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగానూ ఇక్కడి వివాదాలపై చర్చ నడుస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పోటీగా అధికార కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు కాలు దువ్వుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీలోనూ వర్గపోరు తగ్గడం లేదు. మంత్రుల సమక్షంలోనే పెత్తనం కోసం పాకులాడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాలతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



దుబ్బాకలో ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల రసాభాస

సంగారెడ్డి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతంలో ఎన్నడూ లేనివిధంగా మెతుకు సీమ రాజకీయాలు వేడెక్కి కనిపిస్తున్నాయి. గడిచిన 20 ఏళ్లలో తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో పాటు అధికారం నిర్వహించిన పార్టీగా ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ బలంగా ఉంది. అయితే రాష్ట్రంలో అధికారం పొందిన పార్టీగా గత 20 నెలల నుంచి కాంగ్రెస్ నేతలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్లు ఆధిపత్య పోరు తారస్థాయికి చేరుతోంది. త్వరలోనే ఎన్నికలు వస్తున్న క్రమంలో ఈ పోటీ మరింత విషమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎమ్మెల్యేలు వర్సెస్ ఇన్‌చార్జిలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఏడింట బీఆర్ఎస్ పార్టీ, మూడు చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలుగా గెలిచిన చోట ఎలాంటి సమస్యలు లేవు. కానీ బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించిన చోట మాత్రం నిత్యం వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. అందుకు సాక్షమే ఇటీవల జరుగుతున్న పరిణామాలు. ప్రధానంగా దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నడుమ నువ్వా.. నేనా అన్నట్లుగా తయారైంది. ఈ నియోజకవర్గంలో జరిగే ప్రతీ కార్యక్రమంలోనూ ఈ ఇద్దరు నేతల అనుచరులు గొడవ పడటం సహజంగా మారింది. గతంలో ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసిన కొండా సురేఖ, ప్రస్తుత ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలోను పలుమార్లు వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఇక నర్సాపూర్ నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కాంగ్రెస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగుతున్నారు. ఇక్కడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆమెతో ఆధిపత్య పోరుకు సై అంటున్నారు. ఇటీవల పలు కార్యక్రమాల్లోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు కొట్లాడే స్థాయికి చేరుకున్నారు. సిద్దిపేటలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ఇటు బీఆర్ఎస్ అటు కాంగ్రెస్ నేతల మధ్య ప్రొటోకాల్ లొల్లి తలెత్తింది.

కాంగ్రెస్‌లోనూ ఆధిపత్య పోరు

అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం రచ్చకెక్కి విమర్శల పాలవుతున్నారు. ప్రధానంగా గజ్వేల్ నియోజకవర్గంలో ఉప్పు నిప్పుగా ఉన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, మరోనేత బండారు శ్రీకాంతరావు మధ్య వివాదం చల్లారినట్లే చల్లారుతూ మళ్లీ భగ్గుమంటోంది. కొద్దిరోజుల క్రితం ఏకమైన ఈ ఇద్దరు నేతల మధ్య ఇటీవల చిచ్చురేగింది. ఇదే నియోజకవర్గంలో మైనంపల్లి హన్మంతరావు వర్గం కూడా తయారైంది. ముగ్గురి మధ్య వర్గపోరు కనిపిస్తోంది. ఇక సిద్దిపేటలో గ్రూపుల తగాదాలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చాలంటూ పలువురు నాయకులు పార్టీ ముఖ్యులకు విన్నవించారు. గ్రూపు తగాదాలతో ఎవరికీ నామినేటెడ్ పదవులు దక్కడం లేదు. అధికారం వచ్చి రెండేళ్లు కావస్తున్నా నిరీక్షణ తప్పడంలేదని కార్యకర్తలు బాధ పడుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

మిగతా 7వ పేజీలో



విద్యార్థికి మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

అల్బెండజోల్ మాత్రల పంపిణీ 93 శాతం పూర్తి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రల పంపిణీ తొలిరోజే 93 శాతం పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు 4,06,494 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. తొలి రోజు 3,77,572 మందికి మాత్రలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఈ నెల 18న మాప్‌అప్ డే రోజున పంపిణీ చేస్తామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శశాంక్‌దేశ్‌పాండే తెలిపారు.

అందరికీ వేయించాలి..

సంగారెడ్డి రూరల్: నులిపురుగుల నివారణతో ఎన్నో ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయని సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని జడ్పీహెచ్ఎస్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)లో సోమవారం నులిపురుగుల నివారణ దినం సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా పిల్లల ఎదుగుదలలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసు లోపు వారందరికి అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు మాత్రలు వేసుకునేలా ఏర్పాట్లు చేపట్టామన్నారు. మిగిలినవారికి అంగన్‌వాడీ, వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి మాత్రలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో నాగనిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు

స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. వాటర్ ప్రూఫ్‌టెంట్లు వేయించాలని, ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానాలు పంపాలని సూచించారు.

పీఎస్ హెచ్‌ఎం పోస్టుల భర్తీ ఎప్పుడు?

20 ఏళ్లుగా ఎస్జీటీల ఎదురుచూపులు

పదోన్నతి లేకుండానే ఉద్యోగ విరమణ

సర్కారు చొరవ తీసుకోవాలని వేడుకోలు

మెదక్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)పై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం వేచుచూస్తున్న ఎస్జీటీలు నిరుత్సాహానికి గురవుతున్నారు. తమకు అవకాశం కల్పించాలని పోరాటం చేస్తున్నారు. అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సర్కారు ఎస్జీటీలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఖాళీగా ఉన్న దాదాపు వెయ్యి పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతి కల్పించే అవకాశం ఉన్నా సంఘాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు పట్టించుకోవడం లేదంటున్నారు. పదోన్నతులు లేకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానం దక్కని ఎస్జీటీలు

అన్ని కేటగిరీ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సర్కార్ సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు మాత్రం స్థానం కల్పించకపోవడంతో వారంతా తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తానని ప్రకటించిన 10,479 పోస్టుల్లో తెలుగు 4,493, హిందీ 3,883, పీఈటీ 1,778 పోస్టులు ఉన్నాయి. మిగితా ఇతర మైనర్ మీడియం పోస్టులున్నాయి. మెదక్ జిల్లాలో తెలుగు 154, హిందీ 130, పీఈటీ 43, ఉర్దూ 3 పోస్టులను గ్రేడ్-1గా అప్‌గ్రేడ్ చేశారు. అప్‌గ్రేడేషన్ తర్వాత జిల్లాలో అతికొద్ది మంది మాత్రమే గ్రేడ్-2 ఉపాధ్యాయులుగా మిలిగిపోయారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల భాషా పండితులు, పీఈటీలు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం అర్హత కలిగిన

మిగతా 8వ పేజీలో

పోస్టులు మంజూరు చేయాలి



గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 10వేల పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి. ఈ పోస్టులను అర్హతగల ఎస్జీటీలకు కేటాయించాలి. తద్వారా ప్రాథమిక పాఠశాలలు బలోపేతం చేయాలి. అప్‌గ్రేడ్ అయిన భాషా పండితులు, పీఈటీ ఉపాధ్యాయ పోస్టుల్లో జీవోలను సవరించి, మళ్లీ ఎస్జీటీలకు పదోన్నతులకు అవకాశం కల్పించాలి.

-ఉపేందర్, ఎస్జీటీయూ మనోహరాబాద్ మండల అధ్యక్షుడు

గుణాత్మక విద్య ఎలా సాధ్యం?



ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా, బోధన, బోధనేతర పనులతో నిరంతరం ఒత్తిడి తెచ్చే విధంగా వవ్యవహరిస్తున్న తీరుతో గుణాత్మక విద్య ఎలా సాధ్యమవుతుంది. ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్ ఫలితాల నమోదు, మధ్యాహ్న భోజనం, మొక్కల వివరాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్, ఇలా యాడైస్‌లో వంద వివరాలను నమోదు చేయడంతో పాటు పనులతో టైం సరిపోవడం లేదు. టీచర్ల కొరత వల్ల బోధనేతర పనులతో సతమతమవుతున్నాం.

-మల్లారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్జీటీలు (ఫైల్)



మెదక్ కొత్త బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మెదక్‌లో బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు

మెదక్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలో పలు చోట్ల పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. జనసమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఈ సోదాలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ రంగనాథ్, పట్టణ సీఐ మహేష్ బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలోని న్యూబస్టాండ్, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు పటిష్టమైన భద్రత కల్పించడంలో భాగంగా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

డెంగ్యూ... డేంజర్ బెల్స్

సంగారెడ్డి జిల్లాలో 60 కేసులు

ఆస్పత్రులకు వరుస కడుతున్న బాధితులు

తాజాగా జోగిపేటలో బాలిక మృతి

పారిశుధ్య లోపం.. వాతావరణ మార్పులే కారణం



సంగారెడ్డి జీజీహెచ్‌లో ఓపీ వద్ద పేషెంట్ల రద్దీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో డెంగ్యూ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 60 కేసులు నమోదయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కొద్ది రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో వస్తున్న మార్పులు డెంగ్యూ కేసుల పెరుగుదలకు కారణమవుతున్నాయి. పలు ప్రభుత్వ హాస్టళ్లలోనూ విద్యార్థులు జ్వరాల బారినపడి ఇంటిబాట పడుతున్నారు. జ్వర బాధితులు ఆస్పత్రులకు వరుస కడుతున్నారు. డెంగ్యూతో జోగిపేటలో బాలిక మృతిచెందడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ తరుణంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

నామమాత్రంగా నివారణ చర్యలు

వానాకాలం..కాలానుగుణ వ్యాధులకు అనువైన కాలం. జిల్లాలో ఇప్పటికే కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ నీటి నిల్వలు ఏర్పడ్డాయి. ఇందులో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు వ్యాప్తి చెందేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. సాధారణ వ్యాధులతో

మిగతా 8వ పేజీలో

గత మూడు నెలల్లో డెంగ్యూ కేసులు

జూన్	1
జూలై	44
ఆగస్టు	13

జాగ్రత్తలు తప్పనిసరి



జిల్లాలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ కేసులు నమోదు కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వైద్య సిబ్బంది ఇంటింటా జ్వర సర్వే చేస్తున్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి. వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

-డా.నాగనిర్మల, డీఎంహెచ్‌వో, సంగారెడ్డి జిల్లా

అక్రమ నిర్మాణాలపై కొరడా



చేర్యాల గేటు ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు తొలగించిన అక్రమ నిర్మాణాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంది, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం చేర్యాల గేటు వద్ద ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. అక్రమ నిర్మాణాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రూ.కోట్లు విలువైన భూములకు ఎసరు..!' కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ రవికుమార్ ఆదేశాలతో ఆర్ఐ రంగయ్య ఆధ్వర్యంలో సిబ్బంది చేర్యాల గేటు వద్ద ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెసిన డబ్బాలు, టిఫిన్ సెంటర్లను తొలగించారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కంటైనర్ దుకాణాన్ని తహసీల్ కార్యాలయానికి తరలించారు. కబ్జాదారులకు నోటీసులు జారీచేశారు. ప్రభుత్వ స్థలాల జోలికొస్తే ఉపేక్షించబోమని, క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. త్వరలోనే ప్రభుత్వ స్థలాలలకు కంచెలను ఏర్పాటు చేసి సూచికల బోర్డులు పెట్టిస్తామని పేర్కొన్నారు.

వదలని వర్షం.. ఆగమాగం

జహీరాబాద్ డివిజన్‌లో భారీ వర్షం

పొంగిపొర్లుతున్న నాలాలు, వాగులు

వరద ప్రవాహంలో ఒకరు గల్లంతు



క్రిష్ణాపూర్-చిడెకన్నె గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

జహీరాబాద్/ఝరాసంగం/కోహీర్/మునిపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగో రోజు వర్షం దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. నారింజ పరివాహక ప్రాంతంలో పంట పొలాలు నీటమునిగాయి. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి-గణపూర్ గ్రామాల మధ్య నారింజ వాగు ఉధృతంగా ప్రవహించడంతో అంతరాష్ట్ర రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఝరాసంగం మండలం ప్యాలవరం-బోపన్‌పల్లి మధ్య వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లి-అల్గోల్ గ్రామల మధ్య వాగు ప్రవాహంలో పొట్టిపల్లికి చెందిన భాస్కర్ గల్లంతయ్యాడని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. సహాయచర్యలు చేపడుతున్నామని ఎస్ఐ వివరించారు. కోహీర్ మండలంలో నారింజ వాగు పరివాహక ప్రాంతాల్లో పొలాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. చింతలఘట్టు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని వాగు ప్రవాహం ముంచెత్తింది. మునిపల్లి మండలం చిన్నచెల్మెడ- అంతారం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

వర్షాల నేపథ్యంలో విపత్తుల పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జహీరాబాద్ తహసీల్దార్ దశరత్ తెలిపారు. అవసరమైతే 9059984274, 9989078230, 9849904249 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రజలను అప్రమత్తం చేయండి : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలోని వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతుండటంతో దగ్గరకు వెళ్లకుండా ప్రజలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో కట్టలు, తూములు తెగిపోయే అవకాశాలున్నాయని ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, విద్యుత్ శాఖాధికారులు కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు ప్రజలు వెళ్లకుండా చూడాలని, జాగ్రత్తలు పాటించాలన్నారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంజీర పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ.26.59 లక్షలు

పాపన్నపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గా మాత ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారి సులోచన, సహాయ కమిషనర్, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, ఆధ్వర్యంలో నిర్వహించామని ఈవో చంద్రశేఖర్ తెలిపారు. 46 రోజులకు సంబంధించి రూ.26.59 లక్షల హుండీ ఆదాయం, మిశ్రమ బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు తెలిపారు. శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారు, దేవాదాయ సిబ్బంది, హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. .

మున్యానాయక్ తండా రోడ్డును పరిశీలించిన అధికారులు

నాగల్‌గిద్ద, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బురదమయంగా మారిన మున్యానాయక్ తండాకు వెళ్లే రోడ్డును కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అధికారులు పరిశీలించారు. పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను అంబులెన్స్ వద్దకు మోసుకెళ్లిన భర్త వార్త ఆంధ్రజ్యోతిలో ప్రచురించగా అధికార యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు పీఆర్‌ఈఈ అంజయ్య, ఏఈ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో మహేశ్వర్‌రావు తదితరులు మున్యానాయక్ తండా రోడ్డును సందర్శించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. అనంతరం బాలింత కౌలస్యబాయి ఇంటికి వెళ్లి జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

బ్యాతోల్ శివార్లలో పేలుడు పదార్థాలు స్వాధీనం

● రూ.40 వేల విలువైన ఎక్స్‌ప్లోజివ్ జెల్, వైర్లు లభ్యం


బ్యాతోల్ శివారులో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

కంది, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఓ రేకులషెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు సంగారెడ్డి జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కంది మండలంలోని బ్యాతోల్ గ్రామ శివార్లలో సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాతోల్, ఎర్దనూర్, ఎర్దనూర్‌తండా, లక్డారం శివార్లలో ఎక్కువగా క్రషర్లు ఉన్నందున కొందరు పేలుడు పదార్థాలను ఎక్కడపడితే అక్కడ నిల్వ చేస్తున్నారు. పోలీసులు, రెవన్యూ, విజిలెన్స్ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బ్యాతోల్ శివారులో తనిఖీల నిర్వహించగా పేలుడు పదార్థాలు లభించాయి. బండరాళ్లను పేల్చడానికి ఉపయోగడించే ఎక్స్‌ప్లోజివ్ జెల్, వైర్లు లభ్యమయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.40 వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ వివరించారు.

కారు, బైకు ఢీ.. మహిళ మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


శివలీల (ఫైల్)

జగదేవ్‌పూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కారు, బైకు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతిచెందిన ఘటన జగదేవ్‌పూర్ మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం నెమిల గ్రామానికి చెందిన శివలీల(45) తన మేనల్లుడు సంతోష్‌తో కలిసి బైక్‌పై జగదేవ్‌పూర్ నుంచి గంధమల్ల వైపు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్ పైనుంచి వారిద్దరు కిందపడగా శివలీల అక్కడికక్కడే మృతి చెందగా సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఆత్మహత్య చేసుకుని ఒకరు.. గుండెపోటుతో మరొకరు

బస్వాపూర్‌లో యువకుల మృతి


ఆత్మహత్య చేసుకున్న వెంకటేశం


గుండెపోటుతో మృతిచెందిన నర్సింలు

పుల్‌కల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వేర్వేరుగా ఘటనల్లో మృతి చెందగా, ఆదివారం పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రగొల్ల మశ్చందర్ కుమారుడు వెంకటేశం (30) ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వెంకటేశం భార్య రుక్మిణి అలియాస్ దివ్య ఇంటి వాకిలి ఊడ్చే విషయమై అత్త జయమ్మతో ఆదివారం తెల్లవారుజామున గొడవపడింది. వెంకటేశం విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చాడు. విషయం తెలియడంతో వెంకటేశం తన భార్యను మందలించాడు. అనంతరం రాఖీ కట్టేందుకు వచ్చిన తన సోదరి సుకన్యను బస్సు ఎక్కించేందుకని పుల్కల్‌కు తీసుకెళ్లాడు. అక్కడే, పురుగుల మందుతాగాడు. దీంతో అపస్మారకస్థితికి చేరుకున్న వెంకటేశంను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందారని డాక్టర్లు నిర్ధారించారు. భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్ఐ విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశంకు కూతురు, కుమారుడు ఉన్నారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన మరో యువకుడు ఎర్రగొల్ల నర్సింలు(30) గుండెపోటుకు గురై మృతి చెందారు. జీవనోపాధి నిమిత్తం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నివాసముంటూ మైక్రో ఫైనాన్స్‌లో పని చేస్తున్నారు. ఎర్రగొల్ల నర్సింలు ఇంట్లో ఉండగానే గుండెపోటు రావడంతో మృతి చెందారు. మృతుడికి భార్య జయమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.


ఎంపీకి బెదిరింపు ఫోన్ కాల్స్‌పై మెదక్ ఎస్పీకి బీజేపీ నేతల ఫిర్యాదు


ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందజేస్తున్న మల్లేశంగౌడ్ తదితరులు

మెదక్ అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, దుండగులను గుర్తించి, శిక్షించాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల నుంచి చత్తీస్‌ఘడ్ నక్సలైట్ల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని, మొన్న హైదరాబాద్ నుంచి బెదిరింపు కాల్ వచ్చిందని ఎస్పీకి తెలిపామన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో గ్రామాగ్రామాన తిరగాల్సి ఉంటుందని, ఎంపీకి హైసెక్యూరిటీ భద్రతను కల్పించాలని కోరామని పేర్కొన్నినరు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సతీష్‌పటేల్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం కేవలం ఐదు రోజులు మాత్రమే గడువు ఇచ్చింది. ఈనెల 9న ఉత్తర్వులు జారీ చేయగా, గడువు 13వ తేదీతో ముగుస్తుంది. ఈ ఐదు రోజుల్లో శని, ఆదివారాలు సెలవులు కావడంతో కేవలం సోమ, మంగళ, బుధవారాలే ఉన్నాయి. సోమవారం నేడు గడిస్తే, రేపు ఒక్కరోజు మాత్రమే రైతుల చేతిలో మిగిలింది. ఇంత స్వల్ప వ్యవధిలో మొత్తం దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి.



బీమా పరిహారం అందుకున్న కుటుంబాలు

సంవత్సరం	కుటుంబాలు	పరిహారం
2022-23	1,390	రూ.69.5 కోట్లు
2023-24	1,491	రూ.74.55 కోట్లు
2024-25	1,482	రూ.74.1 కోట్లు

రైతు బీమా దరఖాస్తుకు మిగిలింది ఒకేరోజు

రేపటితో గడువు పూర్తి

వ్యవసాయ పనుల మధ్య రైతుల పరుగులు

ప్రభుత్వం తీరుపై రైతు సంఘాల ఆగ్రహం

సంగారెడ్డి టౌన్/ సంగారెడ్డి క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే రైతు కుటుంబానికి ఆపత్కాలంలో అండగా నిలిచే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతు మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఉండేందుకు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) ద్వారా రూ.5 లక్షల పరిహారం అందిస్తుంది. ఏటా రైతులు ఈ బీమా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఈ ప్రక్రియ అంతా సవ్యంగానే ఉన్నప్పటికీ, ఈ ఏడాది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను, రైతు సంఘాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

రేపటిలోగా సాధ్యమేనా?

గత సంవత్సరం సంగారెడ్డి జిల్లాలో 2,10,815 మంది రైతులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది కొత్తగా 19,224 మందికి పట్టా పాస్ పుస్తకాలు లభించాయి. అంటే, దాదాపు 2.30 లక్షల మంది రైతులు మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

పనులు వదిలి పరుగులు పెట్టలేరు

వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక రైతులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. కానీ ప్రస్తుతం జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతులకు కొత్త ఆశలు చిగురింపజేశాయి. దీంతో రైతులందరూ వరినాట్లు, ఇతర వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇలాంటి కీలక సమయంలో వ్యవసాయ పనులను వదిలిపెట్టి, రైతు బీమా దరఖాస్తుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం రైతులకు సాధ్యమయ్యే పని కాదు. ఈ పరిస్థితుల్లో చాలా మంది రైతులు గడువులోగా దరఖాస్తు చేసుకోలేకపోతారు. ప్రభుత్వం కావాలనే గడువు తగ్గించి, రైతులకు మొండిచేయి చూపాలని చూస్తోందా అని పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఈ చర్యల ద్వారా తక్కువ మంది రైతులను పథకంలో చేర్చి, ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు.

మూడేళ్లలో రూ.218.15 కోట్ల పరిహారం

సంగారెడ్డి జిల్లాలో రైతు బీమా పథకం ద్వారా గత మూడేళ్లలో ఎంతో మంది రైతు కుటుంబాలకు అండగా నిలిచింది. 5,96,290 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, వివిధ కారణాల వల్ల మరణించిన 4,363 మంది రైతు కుటుంబాలకు రూ.218.15 కోట్లు అందజేశారు. ఈ గణాంకాలు రైతు బీమా పథకం ఎంతమందికి ఉపయోగపడుతుందో స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల, ప్రభుత్వం ఈ పథకంపై నిర్లక్ష్యం వహించకుండా, గడువును పొడిగించి మరింత మంది రైతులకు భరోసా కల్పించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ప్రభుత్వ ధోరణి తగదు

రైతుబీమా పథకానికి అర్హులైన రైతులను గుర్తించడం కోసం ఐదు రోజులు గడువు మాత్రమే పెట్టడమేమిటి? ఈ వ్యవధిలో చాలా తక్కువ మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటారు. ఇలాంటి కుట్ర పూరిత ధోరణి ప్రభుత్వానికి తగదు. సర్కారు ఆర్థిక భారం నుంచి తప్పించుకొనేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి వ్యవసాయ పనులను వదులుకొని కార్యాలయాల చుట్టూ ఎలా తిరుగుతారు. ఈ విషయాన్ని గుర్తించి రైతు బీమా పథకం దరఖాస్తు కోసం ప్రభుత్వం గడువు పెంచాలి.

- గొల్లపల్లి జయరాజ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరలోనే పెద్దపెద్దోళ్ల

చిట్టావిప్పుతా

● రేపిస్టు, బ్రోకర్ గురించి నేను మాట్లాడను

● ప్రాణం పోయినా పద్ధతులను దాటను

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వాఖ్యలు

దుబ్బాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తనకు బీఆర్ఎస్ టార్గెట్, చెత్తగాళ్లతో తనకు పనిలేదని, అవసరమైనప్పుడు పెద్దనాయకుల చిట్టా బయటపెడుతానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతారావు వాఖ్యానించారు. వాడో రేపిస్టు, బ్రోకరుగాడని, చిల్లరగాడు, చెత్తగాళ్ల గురించి మాట్లాడి తనస్థాయిని దిగజార్చుకోనని పరోక్షంగా సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ గురించి అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆలయ పూజారులు సాకేత్‌శర్మ, శ్రీనివాస్ శర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ ఉషయ్యగారి రాజిరెడ్డి శాలువతో సన్మానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పుతూ.. బస్‌లో చాలా మంది ఎక్కుతారు, పోతుంటారన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ పైసలిస్తే మాట్లాడుతున్నారన్నారు. తాను ఇలాంటోళ్లను అసలు పరిగణలోకి తీసుకోనన్నారు. బీఆర్ఎస్ పార్టీయే తన టార్గెట్ అని మైనంపల్లి స్పష్టం చేశారు. తాను ప్రాణం పోయినా పద్ధతులను దాటి రానని తెలిపారు. తాను పేకాట, మందు తాగననీ, ఆధ్యాత్మికంగా ఆలయాలను సందర్శిస్తానన్నారు. ఆయన వెంట నాయకులు మచ్చ శ్రీనివాస్, కాల్వ నరేష్ చంద్రారెడ్డి, తునికి సురేష్, కొంగరి రవి, దేవేందర్, ప్రభాకర్ తదితరులున్నారు.


పూజలు చేస్తున్న మైనంపల్లి హనుమంతారావు

ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు కృషి

● అంతర్జాతీయ, జాతీయ సహకారం పొందుదాం

● జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో వైస్‌చాన్స్‌లర్లు


వర్క్‌షాప్‌లో యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్‌లు

గజ్వేల్/ములుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు కృషి చేద్దామని ఆయా యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు ఉద్ఘాటించారు. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవర్సిటీలో జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను ఉద్యానవర్సిటీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఆదనపు లైబ్రరీని ప్రారంభించారు. ఉద్యానవర్సిటీ వీసీ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యలో నాణ్యతను పెంచడంతోపాటు ర్యాంకింగ్‌ల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు డిజిటల్ లైబ్రరీని ఉపయోగించుకునే విధంగా షైలాఫ్ట్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ పద్ధతులు, ఉత్తమ విధానాలపై సమగ్ర నివేదికను డాక్టర్ వీరాంజనేయులు అందజేశారు. ర్యాంకింగ్‌ను ప్రభావితం చేసే సవాళ్లు, వాటిని అధిగమించడానికి అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలను గూర్చి వివరించారు. ర్యాంకింగ్‌లు తగ్గడానికి ప్రధాన కారణాలను, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నాణ్యమైన పరిశోధన పత్రాలు, ప్రచురణలు తక్కువగా ఉండడం, పేటెంట్లు, వాణిజ్యీకరణ కార్యకలాపాలు తక్కువగా ఉండడం, అంతర్జాతీయ, జాతీయ సహకారాలు లేకపోవడం, ఉద్యోగ అవకాశాలు, ప్లేస్‌మెంట్ డేటాలో లోపాలు, అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి, అధ్యాపకుల అర్హతల్లో మెరుగుదల అవసరమని స్పష్టం చేశారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని వీసీలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, పాలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్, పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ వీసీ ఎం. జ్ఞానప్రకాశ్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, ప్రొఫెసర్లు పురుషోత్తం, శ్రీరామ్ వెంకటేశ్, కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యానవర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

ఆంజనేయులు, గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి తమ తమ వర్గాలను ప్రోత్సహిస్తూ పార్టీలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారని చర్చ స్థానికంగా జరుగుతోంది. అదేవిధంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై సీనియర్ కాంగ్రెస్ నేతలు తిరుగుబావుటా ఎగురవేసిన విషయం తెలిసిందే. పోలీసులు, రెవెన్యూ ఇతర అధికారుల బదిలీల్లో తమ పాత్ర ఉండట్లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన నీలం మధు తన వర్గాన్ని పెంచుకుంటున్నారు.

అధికారులు సతమతం

తాజా రాజకీయ పరిణామాలతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రొటోకాల్ ప్రకారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇవ్వాలా, అధికార కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌లను గుర్తించాలా అనే అంశంలో సతమతమవుతున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించాలంటే కత్తిమీద సాములా మారిందని కొంతమంది అధికారులు వాపోతున్నారు. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లుగా తమ పరిస్థితి తయారైందని పేర్కొంటున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు టార్చర్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల పలువురు అధికారులు తమను వేరే చోటుకు బదిలీ చేయాలని పేర్కొంటూ, ఆ లేఖలో కాంగ్రెస్ నేతలే కారణమంటూ వివరించడం గమనార్హం. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం, ఇన్‌చార్జి మంత్రి దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇరు పార్టీల నేతలు అనేక విషయాల్లో తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నారని అధికారుల బహిరంగంగానే చెబుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొంది. సర్కారు కార్యక్రమాల్లో ఫ్లెక్సీల తయారీ నుంచి సంక్షేమ పథకాల పంపిణీ ముగిసేదాకా టెన్షన్‌తో ఉంటున్నామని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో మొర పెట్టుకున్నారు.



విద్యార్థులే కూలీలు

కొల్చారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉన్నది. సోమవారం ఈ నీరున్న చోటును మట్టితో నింపారు. అయితే, కూలీలతో చేయించాల్సిన ఈ పనిని ఉపాధ్యాయులు విద్యార్థులతో చేయించారు. పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులకు పార, ప్లాస్టిక్ తట్టలను చేతికిచ్చి మట్టి పనులు చేయించారు. విద్యార్థులు మట్టిని గంపలోకి ఎత్తి, మోసుకెళ్లి నీరు ఉన్న చోట నింపారు. ఇలా విద్యార్థులను తట్టాపారతో పనులు చేయించడంపై స్థానికులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లపై చెట్టు విరిగిపడిపోవడంతో ఇక్కడి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ చెట్టును తొలగించడంపై విద్యాధికారులు స్పందించడం లేదు.



న్యూస్ బాక్స్

రేపు మండల స్థాయిలో బోధనోపకరణాల మేళా

చిలప్‌చెడ్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న మండలస్థాయిలో బోధనోపకరణాల (టీఎల్ఎం) మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో విఠల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 13న నిర్వహించబోయే టీఎల్ఎం మేళాలో విద్యార్థులకు ఉపయుక్తమైన ఉత్తమమైన, ఆకర్శనీయమైన, ఆర్థిక భారరహిత బోధనోపకరణాలను తయారుచేసుకుని మేళాలో పాల్గొనాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉత్తమమైన పది ప్రదర్శనలను జిల్లా స్థాయికి ఎంపిక చేసి పంపనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

శివ్వంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) ఏకాగ్రతతో ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని ఎంఈవో బుచ్చానాయక్ తెలిపారు. మండల పరిధిలోని పెద్ద గొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కె.శ్రీవల్లి, జి. పరమేశ్వరి ఏ. అక్షయ, జి. భానుశ్రీ లను అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు శాలువాతో ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు.

మహిళా సమైఖ్యలోని అక్రమాలపై విచారణ జరిపించండి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా డీఆర్డీఏ మహిళా సమాఖ్యలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో అంథోని డయాస్సియోకు సోమవారం వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకువస్తున్న అనేక పథకాల్లో కొందరు అధికారుల అండతో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

బాలింతను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నాగల్‌గిద్ద, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శాంతినగర్ తండా పంచాయతీ మున్యానాయక్‌తండాకు ఆంబులెన్స్ రాని పరిస్థితి ఏర్పడడంతో తండాకు చెందిన నిండు గర్భిణి కౌసల్యబాయి(26)ని ఆదివారం తన భర్త వాప్ దాదాపు రెండు కిలో మీటర్ల దూరం మోసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. దీంతో ఆమెకు స్థానిక కరస్‌గుత్తి ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి బాలింత కౌసల్యబాయిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య వివరాలను స్థానిక వైద్యులను అడిగి తెలుసుకొని నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు తండా రోడ్డుకు నిర్మాణ పనులు చేయకుండా నిర్లక్ష్యంగా ప్రవహిస్తున్నారన్నారు. రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత

పటాన్‌చెరు ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పించే విధంగా కార్మికులు పని చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం పటాన్‌చెరులో ఉపకమిషనర్ సురేష్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, 16న కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నందున కార్మికులు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయకుమార్, సూపర్‌వైజర్లు ఉన్నారు.

జాతీయభావం పెరగాలి

రామాయంపేట,ఆగస్ట 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తి, జాతీయవాదం పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లాధ్యక్షుడు వాగ్దాస్ మల్లేష్ గౌడ్ పిలుపునిచ్చారు.రామాయంపేటలో సోమవారం కళాశాల విద్యార్థులతో కలిసి బీజేపీ తిరంగా యాత్ర చేపట్టింది.

● వెల్దుర్తి: ప్రతీ విద్యార్థి తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ నాయకులు శ్రీధర్‌గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన జాతీయ జెండాలను అందజేశారు.

నిబంధనలు బేఖాతర్!

- తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ముమ్మరంగా అపార్టుమెంట్ల నిర్మాణం పనులు
- సెల్లార్ల కోసం బండరాళ్ల పేలుళ్లతో దద్దరిల్లిపోతున్న పరిసరాలు
- హడలెత్తిపోతున్న స్థానికులు
- భద్రతా నిబంధనలు గాలికి
- తెలిసినా పట్టించుకోని అధికారులు!



పెద్ద బండరాళ్లతో వేగంగా వెళ్తున్న టిప్పర్

రామచంద్రాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాటీ పరిధిలో పలు చోట్ల అపార్టుమెంట్ల నిర్మాణాల కోసం సెల్లార్లను తవ్వుతున్నారు. లోతుకు వెళ్లే కొద్దీ బండరాళ్లు రావడంతో వాటిని పేలుస్తూ ముక్కలుగా చేయడంతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లిపోతున్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పేలుడు పనులను ముగించాల్సి ఉండగా, నిబంధనలను పాటించడంలేదు.

ప్రముఖుల పనులు.. సామాన్యులకు ఇక్కట్లు

కొల్లూరు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాల్లో చాల వరకు రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలకు చెందినవి ఉన్నట్టు సమాచారం. దీంతో ఇక్కడ విచ్చల విడిగా పేలుళ్లు జరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వారి నిర్మాణాల వద్దకు వెళ్లేందుకు అధికారులు జంకుతున్నారు. ఫలితంగా సామాన్యులు సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుంది.

అటకెక్కిన భద్రతా నియమాలు

మున్సిపాలిటీ పరిధిలో రాకపోకలు సాగిస్తున్న టిప్పర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 18 గంటల పాటు రాకపోకలు సాగించే టిప్పర్ డ్రైవర్లు వాహనాన్ని అతివేగంగా నడుపుతున్నారు. ఏదైనా చిన్న ప్రమాదం జరిగినా డ్రైవర్లు మంత్రులు, రాష్ట్రంలోని పెద్ద మనుష్యులు, ప్రముఖుల పేర్లు చెప్పి ఎదుటి వారిని బెదిరిస్తున్నారు. అవసరమైతే వారి ముందే డ్రైవర్లు ఫోన్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు అధికారులకు తెలిసినా స్పందించడం లేదు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజావాణిలో సంగారెడ్డి, మెదక్ కలెక్టర్లు ప్రావీణ్య, రాహుల్‌రాజ్



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సంగారెడ్డి, మెదక్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రెండు జిల్లాల కలెక్టరేట్లలో వేర్వేరుగా నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయా జిల్లాల ప్రజలనుంచి అర్జీలను కలెక్టర్లు స్వయంగా స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే ఆర్జీలపై రికార్డుల నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు సంబంధించి సమస్య పరిష్కారమయ్యే వరకు ఫాలోఆప్ తెలపాలన్నారు.

సంగారెడ్డి జిల్లాలో 40 అర్జీలు

సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి మొత్తం 40 అర్జీలు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వాటిలో కొన్ని ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి. సదాశివపేట మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన ఎండీ అహ్మద్ నాచురల్ ప్రొడక్ట్స్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న పోన్నుస్ రైతు సేవా కేంద్రం, పోన్నుస్ క్లిక్ క్యూర్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన శంకరయ్య తమ కాలనీకి రోడ్డు వేయాలని కోరారు. అదేవిధంగా తనకు సంబంధించిన భూమిని భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆర్జీలో కోరారు. పాడైపోయిన పైడిగుమ్మల్ గ్రామ రహదారిని బాగు చేయాలని కోరుతూ కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామస్థులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 66..

మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 66 ఆర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలు 36, ఇండ్లు 10, ఇతర సమస్యలకు సంబంధించినవి 20 ఉన్నాయి. ప్రజా సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తున్న సమయంలో ఓ దివ్యాంగురాలు తనకు ఇందరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన నిబంధనలు పరిశీలించాలని డీఎల్పీవోను ఆదేశించారు. అనంతరం రాఖీ కట్టేందుకు వచ్చిన మహిళలను చూసి కలెక్టర్ కుర్చీలోంచి లేచి వచ్చి రాఖీ కట్టించుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం

● పోలీసు ప్రజావాణిలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల ఎస్పీలు

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడమే ధ్యేయమని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. సోమవారం రెండు జిల్లాల పోలీసు కార్యాలయాల్లో వేర్వేరుగా పోలీసు ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు. తమ సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పోలీసుల సేవలను వినియోగించుకోవాలన్నారు. కాగా మెదక్ జిల్లా నలుమూలల నుంచి 21 ఫిర్యాదులు వచ్చినట్లు మెదక్ ఎస్పీ వెల్లడించారు.

ప్రజలకు మంచి సేవలందించాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

వెల్దుర్తి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించి పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీసులు కష్టపడి పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు.రానున్న ఎన్నికల్లో అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ పరిష్కరించాలని సూచించారు. వెంట తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐ రాజు ఉన్నారు.

భవిత కేంద్రాలతో పిల్లల్లో సామర్థ్యాల పెంపు



సఖీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్/మెదక్, కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లల్లో సామర్థ్యాలు పెంచేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం మెదక్‌లోని ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూ.14 లక్షల వ్యయంతో నిర్మాణ దశలో ఉన్న చేపట్టిన మౌలిక సదుపాయాలను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యాచరణ ప్రణాళిక క్యాలెండర్ ఆవిష్కరించి సంబంధిత వివరాలను డీఈవో రాధాకిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో గల భరోసా, సఖీ సెంటర్స్‌ను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా భరోసా సెంటర్స్ సందర్శించి లీగల్, మెడికల్, చిన్నారుల, కౌన్సిలింగ్ స్టేట్మెంట్ రికార్డింగ్ చేసే గదులను పరిశీలించి భరోసా సెంటర్ నిర్వహణ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సఖీ సెంటర్‌ను సందర్శించి పనితీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సఖి సెంటర్ ద్వారా ఇప్పటివరకు 1391 కేసులు పెట్టామని,అందులో 1131 కేసులకు వివిధ రకాల న్యాయ సేవలు అందించినట్లు,నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకురాలు రేణుక, లీగల్ కౌన్సిలర్ నిర్మల, ఐపీ అసిస్టెంట్ ఎన్ రమేష్, మల్టీపర్పస్ వర్కర్ ఉమామహేశ్వరి, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

● **పాపన్నపేట:** పాపన్నపేట మండలంలో తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను పరిశీలించి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

పీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీ ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

ఎస్జీటీలకు అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో మొండిచేయి చూపి, తమకు రావాల్సిన పదోన్నతులను దూరం చేశారని, అర్హత కలిగిన ఎస్జీటీలు వాపోతున్నారు. గతంలో కామన్ సీనియారిటీతో పదోన్నతులు తీసుకున్నప్పటికీ కూడా అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో సంఘాలు ఎస్జీటీలకు మొండి చేయి చూపారని విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఎదురుచూపులు

గతంలో సర్కార్ హామీ ఇచ్చిన విధంగా 10 వేల పీఎస్ హెచ్ఎం పోస్టులను భర్తీ చేస్తే.. కొంతవరకైనా తమ సమస్యలు తీరుతాయనే భావనలో ఎస్జీటీలు ఉన్నారు. అలాగే ఉన్నత పాఠశాలల మాదిరిగా ప్రాథమిక పాఠశాల్లో కూడీ పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేస్తే బోధనేతర పనులు చూసుకోవడానికి వీలు కలుగుతుందని, తద్వారా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాబోధన మీద దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. 20 నుంచి 30 ఏళ్ల పాటు పని చూస్తూ.. ఎలాంటి పదోన్నతులకు నోచుకోని ఎస్జీటీలకు ప్రతి పాఠశాలలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులు ఇవ్వడం వల్ల పదోన్నతుల అవకాశం పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే జిల్లాలో సుమారు 200వరకు ఎస్జీటీలకు లబ్ధి చేకూరుతుంది.

రావాల్సింది రూ. 8కోట్లు.. వసూలు చేసేది రూ.12.40లక్షలు

(5వ పేజీ తరువాయి)

అధికారుల బృందానికి పెద్దఎత్తున అక్రమాలు కనిపించాయి. షెడ్‌కు అనుమతి తీసుకొని పెద్దఎత్తున భవనాలు నిర్మించినట్లు గుర్తించారు. అధికారుల కొలతలతో రూ.8కోట్లు పన్ను కట్టాల్సిన చోట కేవలం రూ.12.4లక్షలు మాత్రమే చెల్లించడం చర్చకు దారి తీసింది.

మదింపు ప్రక్రియ కొనసాగుతోంది

30 రోజులుగా పరిశ్రమల్లో మదింపు ప్రక్రియ ముమ్మరంగా చేస్తున్నాం. ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది ఇప్పటికే తాజా అసెస్‌మెంట్ ప్రకారం పన్నులు వసూలు చేస్తున్నారు. ఇంకా ఎక్కడైనా పాత అసెస్‌మెంట్ ప్రకారం పన్నులు వసూలు చేస్తుంటే సరిచేస్తాం.

-కిషన్, మున్సిపల్ కమిషనర్

డెంగ్యూ... డేంజర్ బెల్స్

(5వ పేజీ తరువాయి)

పాటు డెంగ్యూ భయపెడుతోంది. పట్టణాలు, పల్లెల్లో నివారణ చర్యలు నామమాత్రంగా తీసుకోవడంతో ప్రజల్లో అవగాహన లేక వీటి తీవ్రత తగ్గుముఖం పట్టడం లేదు. ఈ వ్యాధి రావడానికి ప్రధాన కారణం దోమలే. చెత్త కుప్పలు, ఖాళీ ప్లాట్లు వాటికి ఆవాస కేంద్రాలుగా మారాయి. ఎక్కడపడితే అక్కడ ఖాళీ స్థలాల్లో వాన నీరు, మురుగు చేరి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో డెంగ్యూ సోకే ప్రమాదం పొంచి ఉన్నా శుభ్రం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి.

ఈ సూచనలు పాటిస్తే మేలు

- ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఖాళీ స్థలాలు, పాత టైర్లు, కుండలలో నీటి నిల్వలు, రహదారుల వెంట నీటి గుంతలు లేకుండా చూసుకోవాలి.
- దోమలు ఇళ్లలోకి చేరకుండా కిటికీలు, తలుపులకు మూసుకోవాలి.
- దోమ తెరలు వినియోగం తప్పనిసరి.
- ప్రతి శుక్రవారం డ్రై-డేగా పాటించాలి.
- వేడిచేసి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలి.
- జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులాంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



శ్రావణి

తూప్రాన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన 18 ఏళ్ల యువతి అదృశ్యం కేసు నమోదైంది. సోమవారం ఆమె తల్లి తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడ్డి లక్ష్మి, దశరథ దంపతుల చిన్న కూతురు శ్రావణి (18) తూప్రాన్ నలంద కళాశాలలో గత ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసి, చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటుంది. మానసికంగా బాగాలేకపోవడంతో ఎర్రగడ్డ ఆసుపత్రిలో చూపిస్తున్నారు. లక్ష్మి పలు ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం 5.30లకు పనికి వెళ్లి తిరిగి 8 గంటలకు ఇంటి వచ్చి చూడగా ఇంట్లో నుంచి బయటకు వస్తు శ్రావణి షాపుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి.. ఆరుగురిపై కేసు

నిజాంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కల్వకుంట శివారులో సోమవారం సాయంత్రం పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు చేశారు. ఎస్ఐ రాజేష్ నేతృత్వంలో దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,73,720 నగదు, 6 సెల్ ఫోన్లు స్వాధీన పరచుకున్నారు.

రెండు రోజులు.. వరుస దొంగతనాలు

కొల్చారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొల్చారంలో వరుసగా రెండు రోజుల్లో రెండు దొంగతనాల ఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి కొల్చారంలో ముత్యం శ్రీనివాస్ కిరాణా షాపులో తాళం పగలగొట్టి రూ.30 వేలు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మొయినుద్దీన్ ఘటనా స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. అంతకు ముందు రోజైన శనివారం రాత్రి సైతం రంగంపేట రైస్ మిల్లులో దొంగతనం జరగడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న కారు

● విద్యార్థులకు తప్పిన ప్రమాదం



ఘటనాస్థలంలో ధ్వంసమైన కారు ముందు భాగం

మెదక్ కల్చరల్ ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బైక్ పై వస్తున్న వ్యక్తిని తప్పించే క్రమంలో కారు ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీ కొట్టిన సంఘటన సోమవారం మెదక్ మండలం పాతూరు శివారులో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం హవేళీ ఘనపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు విద్యార్థులను తీసుకొని రామాయంపేట వైపు నుంచి బయలుదేరింది. మెదక్ వైపు నుంచి వెళ్తున్న కారుకు అకస్మాత్తుగా ఓ బైక్ అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో స్కూల్ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న పాతూరుకు చెందిన అనిల్ కాలికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వెంటనే ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. బస్ డ్రైవర్ అప్రమత్తతతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. అయితే సడెన్‌గా బస్సు ఆగడం వలన పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకునీ దర్యాప్తు చేయనున్నట్లు రూరల్ ఎస్ఐ మురళి తెలిపారు.

ఆదివాసీలు హక్కులను కాపాడాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థకార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రజలు తరచూ వివక్షకు, అణచివేతకు గురవుతున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని గిరిజన గురుకుల లా కాలేజ్‌లో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసిల సంస్కృతి, వారసత్వం, హక్కులను గౌరవించడానికే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టం అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా న్యాయ సాయం కావాలంటే న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భూములు ఇచ్చిన రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు విన పత్రం అందజేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిన్నారం సర్వే నెంబరు 1లో హెచ్ఎండీఏ లే అవుట్ కోసం భూములు ఇచ్చిన రైతులు తమకు న్యాయం చేయాలని ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం జిన్నారంలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక 1 సర్వే నెంబరులో 120 ఎకరాల అసైన్డ్ భూములకు గానూ 80 ఎకరాలు, జంగంపేటలో 105 ఎకరాలను హెచ్ఎండీఏ లే అవుట్ కోసం ల్యాండ్ పూలింగ్ కింద సేకరించారని, పరిహారంగా ఎకరాకు 600 గజాల స్థలాల పట్టాలు అందజేసినట్లు రైతులు తెలిపారు. అయితే తమకు పరిహారం కింద అందజేసిన స్థలాల పొజిషన్లు మూడేళ్లు గడుస్తున్నా నేటికీ చూపలేదని, లే అవుట్ అభివృద్ధి పనులు కూడా చేపట్టలేదని నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ దేవదాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయా భూముల వద్దకు చేరుకొని అక్కడి నుంచి చేపట్టిన మట్టి తరలింపుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, రాజేష్, శంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, ఖదీర్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మోహన్, రైతులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ హామీ ఇచ్చి తప్పించుకుంటున్నారు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని, 42 శాతం బీసీ రిజర్వేషన్ కూడా హామీని ఇచ్చి ఇప్పుడు కేంద్రంపై మోపి అమలు చేయకుండా తప్పించుకోవాలని చూస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను అందచేసి విలేకరులతో మాట్లాడారు. ధ్యాస లేకుండా హామీలిచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు బీసీల రిజర్వేషన్ అమలుపై చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. కాగా వర్షాల వల్ల పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చి ఇబ్బందిపడుతున్నారని దానిపై అధికారులు తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని పలు వార్డులలో ఎమ్మెల్యే సునీతారెడ్డి స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ మణిభూషణ్‌తో కలిసి పర్యటించారు. సమస్యలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

కాలనీని పరిశీలించిన కమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సాపూర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'వర్షం వస్తే ఆ కాలనీ వాసులకు నరకమే' అనే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి స్పందించారు. సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీ వాసుల ఇబ్బందులను గుర్తించి శాశ్వతంగా సమస్య పరిష్కారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రైతువేదిక భవనం పునరుద్ధరణ

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా రైతు వేదికలు' అనే శీర్షికన ఈ నెల 11న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం రైతువేదిక భవనం వద్ద ఉన్న పిచ్చి మొక్కలు, పొదలు, మద్యం సీసాలను తొలగించి శుభ్రం చేసి సమావేశాలకు సిద్ధం చేశారు.

వీరభద్ర స్వామి ఆలయంలో సందడి

గుమ్మడిదల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం బొంతపల్లి, వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం సందర్భంగా స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

కేతకీలో...

ఝరాసంగం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఝరాసంగంలో గల కేతకీసంగమేశ్వరాలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక,మహారాష్ట్రతోపాటు ఇతర పట్టణాలనుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. మహారాష్ట్రలోని అమ్మదాపూర్ నుంచి భక్తులు ఆదివారం రాత్రి కేతకి ఆలయానికి పాదయాత్రగాతరలివచ్చి సోమవారం స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



జహీరాబాద్: విద్యార్థినికి నులిపురుగు మాత్రలను వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



గుమ్మడిదల ప్రాథమిక పాఠశాలలో నులిపురుగులు మందులు వేస్తున్న వైద్య బృందం



పెద్దశంకరంపేటలో కేజీబీవీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న అధికారులు



నర్సాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో ఆల్బెండజోల్ మాత్రను విద్యార్థికి వేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నులిపురుగుల నివారణ దినోత్సవం

జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సోమవారం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ఆరోగ్య సిబ్బంది పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి 1నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ డీఈసీ(ఆల్బెండజోల్) మాత్రలను వేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొని నులిపురుగుల నివారణ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఆల్బెండజోల్ మాత్రలు మింగడం వల్ల కడుపులోని నులిపురుగులు నివారించబడి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజుల పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

- న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి)